క్లుప్తంగా

అకాల వర్షంతో అవస్థలు



పాలకొండ రూరల్: రావాడ వీధిలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పాలకొండ రూరల్: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో లోతట్టు వీధులు, పంట భూముల్లోకి నీరు చేరింది. పిడుగులు, గాలులతో కూడిన భారీ వర్షం దాదాపుగా 40 నిమిషాలు కొనసాగడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. నగర పంచాయతీ పరిధిలోని రావాడ వీధి, కస్పావీధితో పాటు రజక వీధిలో నీరు రహదారిపైకి చేరింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలే స్వయంగా నీటిని బయటకు పంపించుకోవాల్సి వచ్చింది. గాలులకు వరిచేను ఒరిగిపోయే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు.

చిరుజల్లులతో ఊరట..

భామిని: మండలంలో చిరు జల్లులు కురిసాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల నుంచి పంటలు తేరుకుంటున్న తరుణంలో చిరు జల్లులు కురవడం ఇబ్బందికరంగా మారింది. ఇదిలా ఉంటే జల్‌జీవన్ మిషన్ కింద కుళాయిల కోసం వీధుల్లో తవ్వకాలు చేపట్టారు. దీంతో వర్షపు నీరంతా గోతుల్లోకి చేరడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేకపోయారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న డైరెక్టర్ ప్రభుదాస్

భామిని: మండలంలోని సింగిడి కల్యాణ మంటపంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ.. బాలికలు సృజనాత్మక శక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఐసీటీ వినియోగంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీల వివరాలు

- కలెక్టర్ డా.ఎస్ ప్రభాకరరెడ్డి



పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల వివరాలను మీ కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చునని కలెక్టర్ డా.ఎస్. ప్రభాకరరెడ్డి తెలిపారు. అలాగే ప్రతి రోజూ ప్రజలు తమ సమస్యల వినతులను అందజేసేందుకు కలెక్టరేట్‌లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పీజీఆర్ఎస్ సెల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఫిర్యాదులపై అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే వచ్చిన అర్జీల వివరాలను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

సాలూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ త్వరలో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొనాలనుకునే అర్హులైన అభ్యర్థులు కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్ వద్ద వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7382559022 నంబరును సంప్రదించాలని సూచించారు. సాలూరు, పరిసర ప్రాంతాల యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరికి తెగులు...
అన్నదాతకు దిగులు

- వరుస వర్షాలతో వరి పంటకు తెగుళ్లు ఆశించే అవకాశం
- ముందస్తు సస్యరక్షణతో చెక్ పెట్టాలంటున్న అధికారులు

పాలకొండ రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి అన్నదాతలు ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు అన్నదాతపై పగబట్టినట్లు కురుస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో సాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొన్న కర్షకులకు ప్రస్తుత తుపానులు, వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నియోజకవర్గంలో అధిక శాతం వరి పంట ప్రస్తుతం దుబ్బు, పొట్ట దశలో ఉంది. ఈ తరుణంలో పొలాల్లో నీరు నిలిచిపోవడంతో తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. పాలకొండ మడలం చిన్న, గొట్ట మంగళాపురం, వీరఘట్టం రహదారిలో, తుమరాడ, తంపటాపల్లి, చింతాడ, తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాలు నీటి ముంపునకు గురయ్యాయి. కీలక పొట్ట దశ నుంచి కంకి దశకు మారే సమయంలో తెగుళ్ల బారిన పడితే దిగుబడిపై ప్రభావం తప్పదని రైతులు వాపోతున్నారు. ఈ తరుణంతో సస్యరక్షణపై దృష్టి పెట్టాలని వ్యవసాయధికారులు సూచిస్తున్నారు.

సుడి దోమ కారణంగా..

వరుస వర్షాలు, మధ్య మధ్యలో అధిక ఎండ తీవ్రతో కారణంగా సుడిదోమ తన ఉధృతిని పెంచుకునే అవకాశం ఉంది. పంట మొదళ్లలో ఈ దోమలు అధిక సంఖ్యలో దర్శనమిస్తాయి. పైరులో నిల్వ ఉన్న నీటి పైభాగంలో తేలి ఆడుతూ, చేను మొదలు చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చి వేస్తాయి. దీని ప్రభావంతో ఆకు పసుపు రంగులోకి మారుతుంది. వీటి ఉధృతి అధికంగా ఉంటే చేను మధ్య నిల్వ ఉన్న నీటిపై నూనె తెట్టులాగా కనిపిస్తుంది. చేనుపైభాగం సుడులుగా ఎండిపోతుంది. దీనినే హాఫ్ బర్న్‌గా కూడా పిలిస్తారు. పొట్టదశలో ఆశిస్తే గింజ రాదు. గింజ దశలో ఆశిస్తే దిగుబడి ఘననీయంగా పడిపోతుంది. నూక శాతం అధికంగా వస్తుంది. ఒక్కోసారి పూర్తిగా పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అలాగే కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది.





పంటను తెగుళ్ల బారి నుంచి రక్షణ కల్పించేందుకు కాలిబాట ఏర్పాటు చేస్తున్న రైతు (ఇన్‌సెట్లో) వరికి ఆశించిన సుడి దోమ

సస్యర క్షణ ఇలా..

- ఈ తరహా దోమలను పొలంలో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి.
- తూర్పు, పడమర దిశల్లో రెండు మీటర్ల దూరంలో చేలను పాయలుగా విడదీసి, గాలి బాటలు ఏర్పాటు చేయాలి.
- దీని కారణంగా గాలి, వెలుతురు సోకి దోమ ఉధృతి తగ్గుతుంది.
- పొలంలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపితే దోమల గుడ్లు, చిన్న దోమ నశిస్తాయి.
- దోమ కనిపించిన మొదటి దశలో వేప నూనె 1500 పీపీఎంను సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది.
- తర్వాత దశలో టెలెప్పమిజో ఫైరిమ్ మందును 94 మిల్లీలు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పొట్ట దశలో ఈ సమస్య ఉంటే యూరియా, పొటాష్ పైపాటుగా వేస్తే రోగనిరోధక శక్తి చేనుకు సమకూరుతుంది.
- సరైన సమయంలో స్పందించకుంటే కాండం కుళ్లు, దోమ ఉధృతి నివారించలేమని, ఒకరి పొలంలో దోమ కనిపిస్తే గంటల వ్యవధిలో పక్క వందలాది ఎకరాలకు పాకుతుంది.

అప్రమత్తంగా ఉండాలి..



విభిన్న వాతావరణంతో తెగుళ్లు ఆశించే అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో రైతులు తమ పంటను ఓ కంట కనిపెడుతూ అప్రమత్తంగా ఉండాలి. చిన్న సమస్యను గుర్తించినా స్పందించాలి. క్షేత్రస్థాయిలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. వారి సలహాలు, సూచనలు పొందాలి.

– వరప్రసాద్, వ్యవసాయాధికారి, పాలకొండ

విద్యార్థుల ఆరోగ్యంపై పూర్తిస్థాయి సమాచారం ఇవ్వండి



కురుపాం సీహెచ్‌సీ వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

- మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)ని మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి ఆదివారం సందర్శించారు. ఇప్పటివరకు ఎంతమంది విద్యార్థులు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు..ఇక్కడి నుంచి ఏయే ఆస్పత్రులకు ఉన్నత వైద్యం కోసం ఎంతమందిని రిఫర్ చేశారు..ఏయే విద్యార్థి ఆరోగ్యం ఏ విధంగా ఉందన్న విషయాలపై వైద్య సిబ్బందిని ఆమె ఆరా తీశారు. పచ్చకామెర్లు బారినపడి వైద్యసేవలు పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై పూర్తిస్థాయి సమాచారం అందివ్వాలని కోరారు. అయితే ఆమె అడిగిన వివరాలు పూర్తిస్థాయిలో సిబ్బంది అందించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై అటు ప్రభుత్వానికి, ఇటు అధికార యంత్రాంగానికి ఇంత నిర్లక్ష్యం తగదన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి..

అక్కడి నుంచి ఏకలవ్య పాఠశాలకు వెళ్లిన ఆమె.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రిన్సిపాల్ బహదూర్‌ను ఆరాతీశారు. ఎంతమందికి పచ్చకామెర్లు వచ్చాయి..ఇప్పుడు ఎవరెవరికి బాగుంది..ఎవరెవరికి బాగోలేదన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ విద్యార్థుల ఆరోగ్యంపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. అవసరమైన వారికి తక్షణమే వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు బంగారు నాయుడు, టీవీఎస్ స్వామియాజులు, రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి నూరెళ్ల, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, మండల కో–ఆప్షన్ సభ్యులు జిలానీ, వైఎస్సార్ సీపీ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వరిలో పొటాష్ వినియోగంతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: వరి సాగులో పొటాష్ వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న తెలిపారు. ఇదే విషయమై ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పంట పొట్ట దశలో ఉన్నప్పుడు పొటాష్ జల్లుకుంటే మేలు అని, ఏ పంటకు అయినా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వేసుకోవడం మంచిదన్నారు. ప్రధానంగా వరిలో పొటాష్ వేసుకోకపోతే చేను పడిపోతుందన్నారు. అలాగే ధాన్యం గింజలలో పొల్లు శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. ఒక్కోసారి పొటాష్ లోపం వల్ల టుంగ్రో వైరస్ సోకుతుందన్నారు. వరి చేనుకు రెండు విడతలుగా పొటాష్ వేసుకోవాలని, మొదటి విడతగా ఆఖరి దమ్ములో 15 నుంచి 20 కిలోలు..రెండో విడతలో చిరు పొట్టదశలో 15 కిలోలు ఎకరాకు వేసుకోవాలన్నారు. ఇలా చేస్తే గింజ నాణ్యంగా ఉండడంతో పాటు దిగుబడులు కూడా బాగా వస్తాయన్నారు.

ఇది ఓ యజ్ఞం ..

- మాజీ ఎమ్మెల్యే కళావతి



కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఓ యజ్ఞంతో సమానమని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఆదివారం రాత్రి వండువ గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మిడితాన కల్యాణి, వైస్ ఎంపీపీ విశ్వాసరాయి భార్గవ్, కండల వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్తీ మద్యంపై పోరుబాట

పాలకొండ: కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ క్రమంలో కల్తీ మద్యంపై పోరుబాట కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఏలాం సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం అక్కడ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

వేదం ఫలితాల్లో గురండి విద్యార్థుల సత్తా

భామిని: శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో శ్రీ వేదం ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత, మైథాలజీ పోటీలలో భామిని మండలం గురండి విద్యావికాస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఎస్. మృదుల, లాడి లాస్య, కొల్ల రిసీత సత్తా చాటి పాఠశాల పేరు ఇనుమడింపజేశారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.గాంధీరాజు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



జిల్లా స్థాయి ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థి లాడి లాస్య

పరామర్శ

పాలకొండ: పట్టణంలోని పెదకాపు వీధికి చెందిన ఉదయాన సుజాతమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరామర్శించారు. సుజాతమ్మ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా సుజాతమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శలో ఆమెతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.



సుజాతమ్మ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

సైబర్ నేరాలపై అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై.అమ్మన్నరావు సూచించారు. ఆదివారం స్థానిక అడ్వంచర్ పార్కు వద్ద ప్రజలకు సైబర్‌నేరాలు, రహదారి భద్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని.. ఘాట్‌రోడ్‌లలో జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవ్ పాల్గొన్నారు.

భగవంతుడిపై నమ్మకంతో జీవించాలి

పాలకొండ: ప్రతి ఒక్కరూ భగవంతుడిపై నమ్మకంతో జీవించాలని సత్యసాయి ప్రతినిధి ఎస్‌వీ రమణ అన్నారు. పట్టణంలోని నాగవంశపు వీధిలోని రామ మందిరంలో దివ్యజ్ఞాన సంత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మనశ్శాంతి పొందాలంటే దైవానుగ్రహం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు డి. యోగీశ్వరరావు, ఎం. మోహనదాస్, ఎస్. మల్లేశ్వరరావు, జడ్డు జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.



సత్సంగ సమావేశంలో ప్రసంగిస్తున్న వక్త

ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

గరుగుబిల్లి: ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్), ఏపీ గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి బ్యాంక్‌లను కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా చేశారు. ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకుల డేటాను ఒకే ప్లాట్‌ఫామ్ పైకి తీసుకువచ్చే సాంకేతిక ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఈ క్రమంలో బ్యాంకు ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతుండగా బ్యాంకుకు వచ్చే ఖాతాదారులంతా నిరాశతో వెనుదిరుగుతున్నారు. గడిచిన రెండు రోజుల నుంచి యూపీఐ సేవలు నిలిచిపోగా ఖాతాదారులు ఇబ్బందిపడ్డారు. సోమవారం వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, డేటా అనుసంధాన ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి ఖాతాదారుని బ్యాంకు ఖాతా నంబరుతో పాటు ఐఎఫ్‌సీ కోడ్ కూడా మారుతుందని బ్యాంకు సిబ్బంది స్పష్టం చేశారు.

యువతలో సేవా స్ఫూర్తి పెంచడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

గరుగుబిల్లి: యువతలో క్రమశిక్షణ, శక్తి, సేవా స్ఫూర్తి పెంచడమే ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) లక్ష్యమని సమరసత సేవా ఫౌండేషన్ ఏపీ స్వయం సేవకులు ముద్దు సాయిరాం తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా విజయదశమి ఉత్సవం మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరణించిన ఆర్ఎస్ఎస్ స్థాపకులు, నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ స్థాపన ఉద్దేశం, లక్ష్యాలు, విజయాలను ఆయన వివరించారు. స్వదేశీ భావన, దేశభక్తి, సామాజిక సమైక్యత, ధర్మ పరిరక్షణ వంటి భావాలను ప్రతి పౌరుడూ పెంపొందించుకోవాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కమ్మేసిన పొగమంచు



గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతాన్ని పొగమంచు కమ్మేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి కురవడం ఆరంభమైన మంచు ఆదివారం ఉదయం 7 గంటల వరకు కొనసాగింది. దీంతో ఆ సమయంలో సొంత పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారు, వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. మంచు వల్ల దారి కనబడడం లేదని, దగ్గరకు వెళ్తే తప్ప అక్కడ ఏముందో చెప్పలేని పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. తాడికొండలో కురుస్తున్న పొగమంచును చిత్రంలో చూడొచ్చు.

–గుమ్మలక్ష్మీపురం

రహదారి అధ్వానం..



పాలకొండ మండలంలోని అన్నవరం గ్రామ రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడబడితే అక్కడ గోతులేర్పడడంతో పాదచారులు, వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్



ఆకట్టుకుంటున్న సున్నపుగెడ్డ జలపాతం



పరవళ్లు తొక్కుతున్న కేపీ ఈతమానుగూడ జలపాతం

సరికొత్త జలపాతాలు.. చూసొద్దాం రండి!



మల్లెమ్మ జలపాతం హొయలు

ప్రకృతి అందాలకు నెలవైన సీతంపేట ఏజెన్సీలో సరికొత్త జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. ఇప్పటికే మెట్టుగూడ జలపాతాన్ని గుర్తించిన అధికారులు దానిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురాగా కంటపడని జలపాతాలు మరెన్నో ఉన్నాయని పలువురు పర్యాటకులు చెబుతున్నారు. కొండ కోనల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎత్తైన కొండల పైనుంచి జాలువారే జలపాతాలు చూపరుల మదిని దోచుకుంటున్నాయి. వాటిపై కూడా దృష్టిసారిస్తే పర్యాటకంగా సీతంపేట ఓ వెలుగు వెలుగొందుతుందని సందర్శకులు అభిప్రాయపడుతున్నారు. కొత్త జలపాతాల్లో కొన్నింటిని ఈ చిత్రాల్లో చూడొచ్చు.

–సీతంపేట

అంధకారంలో గారమ్మ కాలనీ



వీధి దీపాలు వెలగక అంధకారంలో చిక్కుకున్న గారమ్మ కాలనీ

పాలకొండ రూరల్: పట్టణంలోని గారమ్మకాలనీలో అంధకారం నెలకొంది. కనీసం వీధి దీపాలు కూడా వెలగడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. వరుస వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు ఆదివారం గాలులతో కూడిన వర్షం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేస్తే.. నగర పంచాయతీ అధికారులకు చెప్పుకోమంటున్నారని వాపోతున్నారు.